రాయలసీమ లిఫ్ట్ పనులు ఆపండి

- పోతిరెడ్డిపాడు విస్తరణను నిలువరించండి.. ఆ పనులు ఎన్జీటీ అవార్డుకు విరుద్ధం
- కేఆర్ఎంబీకి తెలంగాణ సర్కారు లేఖ

హైదరాబాద్, అక్టోబర్5 (నమస్తే తెలంగాణ): జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్జీటీ) ఆదేశాలను ఉల్లంఘిస్తూ ఏపీ ప్రభుత్వం చేపట్టిన నీటిపారుదల పనులను నిలిపివేయాలని తెలంగాణ సర్కారు కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కేఆర్ఎంబీ)ని డిమాండ్ చేసింది. ఏపీ ప్రభుత్వం రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ఫేజ్-1 పనులను చేపడుతున్నదని, పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరీ విస్తరణకు పూనుకున్నదని, వెంటనే ఆ పనులను నిలిపివేయాలని, ఆ దిశగా సత్వర చర్యలు చేపట్టాలని కోరుతూ (కేఆర్ఎంబీ)కి తెలంగాణ సాగునీటి పారుదలశాఖ ఈఎన్సీ మురళీధర్ గురువారం లేఖ రాశారు. ఏపీ ప్రభుత్వం ఎలాంటి అనుమతులు లేకుండా, ట్రిబ్యునల్ అవార్డులకు విరుద్ధంగా ఔట్‌బేసిన్‌కు కృష్ణా జలాలను తరలించేందుకు రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని చేపట్టిందని గుర్తుచేశారు. ఇదేవిషయమై ఎన్జీటీని ఆశ్రయించగా పర్యావరణ అనుమతులు లేకుండా రాయలసీమ ఎత్తిపోతల పథకం పనులను చేపట్టకూడదని 2020లో ఆదేశాలు జారీ చేసిందని గుర్తుచేశారు. ఆ ఆదేశాలను బేఖాతర్ చేస్తూ ఏపీ ప్రభుత్వం తాజాగా రాయలసీమ ఎత్తిపోతల పథకం తొలిదశ పనులను చేపట్టేందుకు పూనుకున్నదని వివరించారు.

అవార్డుకు విరుద్ధంగా ఏపీ ఉత్తర్వులు

జూన్ నుంచి జూలై మధ్యలో, 2913 క్యూసెక్కుల సామర్థ్యంతో 6 పంపులను ఏర్పాటుచేసి, మొత్తంగా 59టీఎంసీలను ట్రిబ్యునల్ అవార్డుకు విరుద్ధంగా పూర్తిగా ఔట్‌సైడ్ బేసిన్‌కు తరలించేందుకు అవసరమైన పనులను చేపట్టేందుకు ఏపీ ఉత్తర్వులు జారీచేసిందని తెలంగాణ వెల్లడించింది. అదీగాక శ్రీశైలం నుంచి చెన్నై తాగునీటికి 15టీఎంసీలను మాత్రమే అందివ్వాల్సి ఉందని, కాలువ సామర్థ్యం కూడా 1500 క్యూసెక్కులే ఉండాలని అంతర్రాష్ట్ర ఒప్పందం నిర్దేశించిందని గుర్తుచేశారు. కానీ అందుకు విరుద్ధంగా ఏపీ ప్రభుత్వం కాలువ సామర్థ్యాన్ని తొలుత 11,500 క్యూసెక్కులకు, అటు తరువాత 44వేల క్యూసెక్కులకు, ప్రస్తుతం 80వేల క్యూసెక్కుల సామర్థ్యానికి పెంచేందుకు పూనుకున్నదని తెలిపారు. ఈ నేపథ్యంలోనే రాయలసీమ ఎత్తిపోతల పథకంలో భాగంగానే పోతిరెడ్డిపాడు లైనింగ్, విస్తరణ పనులను చేపడుతున్నదని, ఇప్పటికే శ్రీశైలం రైట్ మెయిన్ కెనాల్ లైనింగ్‌ను పూర్తిచేసిందని బోర్డుకు తెలంగాణ తెలిపింది. ఏపీ చేపట్టిన పనులకు సీడబ్ల్యూసీ నుంచి ఎలాంటి అనుమతులు లేవని, ప్రస్తుతం ఈ అంశాలన్ని ట్రిబ్యునల్2 ఎదుట విచారణలో ఉన్నాయని వివరించారు. అయినప్పటికీ ఏపీ ఎన్జీటీ ఉత్తర్వులను, ట్రిబ్యునల్ అవార్డులను ఉల్లంఘిస్తూ పనులను చేపట్టేందుకు పూనుకోవడం పట్ల తెలంగాణ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇకనైనా రాయలసీమ లిఫ్ట్ పనులపై ఏపీ ప్రభుత్వం ముందుకు పోకుండా నిలువరించాలని, ఆ దిశగా సత్వరమే చర్యలు చేపట్టాలని బోర్డును డిమాండ్ చేసింది.

నేడు కృష్ణాబోర్డు త్రిసభ్య కమిటీ సమావేశం

హైదరాబాద్, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ): కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కేఆర్ఎంబీ) త్రిసభ్య కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించనున్నారు. ఈ మేరకు తెలంగాణ, ఏపీ రాష్ట్రాలకు కేఆర్ఎంబీ ఇప్పటికే సమాచారం అందించింది. ఉమ్మడి ప్రాజెక్టుల నుంచి నీటి విడుదలకు సంబంధించిన అంశంపై త్రిసభ్య సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

మూడు రాష్ట్రాలకు 105 టీఎంసీలు

- తుంగభద్ర బోర్డు సమావేశంలో నీటివాటా కేటాయిస్తూ నిర్ణయం
- కేసీ కెనాల్‌కు 4.096 టీఎంసీల కేటాయింపు

అయిజ, అక్టోబర్ 5: మూడు రాష్ట్రాలకు 105 టీఎంసీలను కేటాయిస్తూ తుంగభద్ర బోర్డు (టీబీ) సమావేశంలో నిర్ణయించారు. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులతో ఆర్డీఎస్ ఆయకట్టుకు 3.224 టీఎంసీలు కేటాయించారు. గురువారం కర్ణాటకలోని తుంగభద్ర జలాశయం అతిథి గృహంలో బోర్డు ఎస్ఈ శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ, ఏపీ, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన ఎస్ఈలు, ఈఈలతో సమావేశం నిర్వహించారు. నదీ పరీవాహక రాష్ట్రాలు కేడబ్ల్యూడీటీ (కృష్ణా వాటర్ డిస్ప్యూట్ ట్రిబ్యునల్) నిబంధనల మేరకు 212 టీఎంసీలు వినియోగించుకునేలా కేటాయింపులు జరిపారు. ఈ మేరకు కర్ణాటకకు 138.990 టీఎంసీలు, ఏపీకి 66.500 టీఎంసీలు, ఆర్డీఎస్‌కు 6.510 టీఎంసీలు వాడుకునేందుకు అవకాశం ఉన్నది. అయితే నాలుగైదేండ్లుగా తుంగభద్ర నదికి వస్తున్న వరదలను దృష్టిలో ఉంచుకుని 2023-24 ఏడాదిలో 105 టీఎంసీలు వస్తుందని అధికారుల అంచనా. అయితే.. 2023, జూన్ 8న జరిగిన సమావేశంలో తుంగభద్ర బోర్డు ఎస్ఈల సమావేశంలో 175 టీఎంసీలు వస్తాయని అంచనా వేసినా వర్షాలు కురవకపోడంతో అంచనాలను సవరించి నీటి కేటాయింపులు చేశారు. కర్ణాటకకు 68.839 టీఎంసీలు, ఏపీకి 32.936టీఎంసీలు, తెలంగాణలోని ఆర్డీఎస్‌కు 3.224 టీఎంసీలను వినియోగించుకునేలా నిర్ణయం తీసుకున్నట్టు ఆర్డీఎస్ ఈఈ విజయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో ఎస్ఈలు, ఈఈ, ఎస్డీవో పాల్గొన్నారు.

వృద్ధులకు ఇంటినుంచే ఓటు

80 ఏండ్లు పైబడినవారికి అవకాశం

- 40 శాతం మించి వైకల్యమున్నా..
- ఈసారి కొత్త ఓటర్లు 8.11 లక్షలు
- 22 లక్షల ఓట్ల తొలగింపు
- అసెంబ్లీ ఎన్నికలకు రాష్ట్రంలో 35,356 పోలింగ్ కేంద్రాలు
- ఆన్‌లైన్ ప్రలోభాలపై ప్రత్యేక నిఘా
- అక్రమాలపై యాప్‌లో ఫిర్యాదులు
- కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ రాజీవ్‌కుమార్

హైదరాబాద్ తాజ్‌కృష్ణ హోటల్‌లో మీడియా సమావేశంలో సీఈసీ రాజీవ్‌కుమార్, ఈసీలు పాండే, అరుణ్‌గోయల్

హైదరాబాద్, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ): వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో వయోవృద్ధులు, వికలాంగులకు ఇంటినుంచి ఓటు హక్కు వినియోగించుకొనే అవకాశం కల్పిస్తున్నట్టు కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) రాజీవ్‌కుమార్ తెలిపారు. 80 ఏండ్లు పైబడిన వృద్ధులు, 40 శాతానికిపైగా వైకల్యం ఉన్నవారు ఇంటి నుంచి ఓటువేసేందుకు అర్హులని తెలిపారు. ఇంటినుంచి ఓటు వేయాలనుకొనేవారు ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన 5 రోజుల్లో ఫారం-12డీ ద్వారా ఎన్నికల రిటర్నింగ్ లేదా అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ విధానాన్ని మొదటిసారి కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో ఈసీ అమలుచేసింది. అసెంబ్లీ ఎన్నికలపై అధికార యంత్రాంతం సన్నద్ధతను పరిశీలించేందుకు రాష్ట్రంలో మూడురోజుల పర్యటన జరుపుతున్న ఈసీ బృందం చివరిరోజు గురువారం హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో మీడియా సమావేశం నిర్వహించింది. సీఈసీ రాజీవ్‌కుమార్, ఈసీలు అనూప్‌చంద్ర పాండే, అరుణ్‌గోయల్ తెలంగాణ సీఈవో వికాస్‌రాజ్ ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజీవ్‌కుమార్ మాట్లాడుతూ.. తెలంగాణలో 7,689 మంది 100 సంవత్సరాల వయసు పైబడిన ఓటర్లున్నారని తెలిపారు. 80 ఏండ్లకు పైబడినవారు 4.43 లక్షల మంది ఉన్నారని, వీరందరికీ ఇంటి నుంచి ఓటు వేసే అవకాశం ఉన్నదని చెప్పారు.

ఆన్‌లైన్ ప్రలోభాలపై ప్రత్యేక దృష్టి

తెలంగాణ రాష్ట్రం గొప్ప సంస్కృతి, సంప్రదాయాలకు నెలవు అని రాజీవ్‌కుమార్ అన్నారు. ఈ రాష్ట్రం మినీ ఇండియాగా ఉంటుందని, దేశంలోని అన్నిప్రాంతాలవారు ఇక్కడ నివసిస్తున్నారని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించడానికి అన్నిరకాల ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు. మూడురోజుల పర్యటనలో రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ, కలెక్టర్లు, ఎస్పీలు, సీపీలు, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలతో సమావేశం నిర్వహించి, వారి విజ్ఞప్తులు స్వీకరించామని తెలిపారు. ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు మద్యం, డబ్బు, బహుమతులు అందించేవారిపట్ల కఠినంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించామని చెప్పారు. యూపీఐ, ఆన్‌లైన్‌లో చెల్లింపుల ద్వారా ఓటర్లకు డబ్బులు పంచేవారిని గుర్తించేందుకు స్టేట్ లెవెల్ బ్యాంకర్స్ కమిటీ (ఎస్ఎల్‌బీసీ) ద్వారా ఆర్‌బీఐ దృష్టి పెట్టిందని వెల్లడించారు. ఒక అకౌంట్ నుంచి అనేక మందికి డబ్బులు ట్రాన్స్‌ఫర్ అయ్యేవాటిపై దృష్టి పెడుతామని చెప్పారు. రాష్ట్ర సరిహద్దుల్లో చెక్ పోస్టులు పెట్టి, వాటన్నంటికి సీసీ టీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించిన్నట్టు వెల్లడించారు. అటవీ శాఖ ఆధ్వర్యంలోనూ మొదటిసారి చెక్ పోస్టులను ఏర్పాటుచేశామని పేర్కొన్నారు.

22 లక్షల ఓట్ల తొలగింపు

ఓటర్ల జాబితా ప్రక్షాళనలో భాగంగా 2022, 2023 సంవత్సరాల్లో 22 లక్షల ఓటర్లను తొలగించినట్టు సీఈసీ రాజీవ్‌కుమార్ తెలిపారు. 2022లో 14 లక్షల మంది, 2023లో 7.90 లక్షల మంది చనిపోయిన, డూప్లికేట్, తప్పుడు చిరునామా ఉన్న ఓట్లను తొలగించిన్నట్టు చెప్పారు. 2023లో 14 లక్షల ఓటర్లకు సంబంధించి జాబితాలో సవరణలు చేశామని వెల్లడించారు. 2014 నుంచి ఓటరు జాబితాతో పోల్చుకుంటే 1.66 శాతం వార్షిక వృద్ధి నమోదయ్యిందని తెలిపారు. 2023 జనవరితో పోల్చితే 5.8 శాతం వృద్ధి ఉన్నదని వివరించారు. 7.66 లక్షల ఇండ్లల్లో 75.97 లక్షల మంది ఓటర్లు ఉన్నట్టు గుర్తించామని, వీటిలో 4.15 లక్షల మంది ఓటర్ల చిరునామాలను మార్చినట్టు వెల్లడించారు. రాష్ట్రంలో 18, 19 ఏండ్ల వయసున్న 8.11 లక్షల మంది ఈసారి కొత్తగా ఓటు హక్కుల పొందారని వివరించారు. యువతులు 3.45 లక్షల మంది ఉన్నట్టు చెప్పారు. ఇందులో లింగ నిష్పత్తి 707 నుంచి 743కు పెరగడం శుభపరిణామమని పేర్కొన్నారు.

అక్రమాల కట్టడికి ప్రత్యేక చర్యలు

అసెంబ్లీ ఎన్నికల్లో అక్రమాలను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారయంత్రాంగాన్ని సీఈసీ రాజీవ్‌కుమార్ ఆదేశించారు. మద్యం, నగదు అక్రమ రవాణాపై దృష్టి పెట్టాలని సూచించారు. గురువారం హోటల్ తాజ్ కృష్ణాలో రాజీవ్‌కుమార్, అనూప్‌చంద్ర పాండే, అరుణ్‌గోయల్, వికాస్‌రాజ్ కలిసి సీఎస్ శాంతికుమారి, డీజీపీ అంజనీకుమార్, ఇతర అధికారులతో సమావేశమయ్యారు. ఎన్నికల ఏర్పాట్లపై చర్చించారు. ఎన్నికల సమయంలో పోలీసు, ఇతర అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సమావేశంలో ఉన్నతాధికారులు రామకృష్ణారావు, అర్విందకుమార్, నవీన్‌మిట్టల్, స్మిత సభర్వాల్, అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళా శక్తికి నిదర్శనం

రాష్ట్రంలో మొత్తం 3.17 కోట్ల మంది ఓటర్లుండగా.. అందులో మహిళలు, పురుషులు కూడా 1.58 కోట్ల చొప్పున ఉండటం సంతోషకరమని సీఈసీ పేర్కొన్నారు. ప్రతి వెయ్యి మంది పురుషులకు 998 మంది మహిళా ఓటర్లు ఉన్నారని, ఇది మహిళా శక్తికి నిదర్శనమని అన్నారు. 2018లో ఓటర్ లింగనిష్పత్తి 982 ఉండగా.. 2019కి 990కి, 2023 నాటికి 998కి పెరిగిందని వెల్లడించారు.

2018 ఎన్నికల్లో రాష్ట్రంలో 73.37 శాతం ఓటింగ్ నమోదైతే, హైదరాబాద్‌తోపాటు ఇతర మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలోని 29 నియోజకవర్గాల్లో రాష్ట్ర సగటుకంటే తక్కువ పోలింగ్ నమోదైందని గుర్తుచేశారు. ఈ సెగ్మెంట్లలో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు చర్యలు చేపట్టామని వెల్లడించారు. రాష్ట్రంలో నాలుగు పర్టిక్యులర్ వల్నరబుల్ ట్రైబల్ గ్రూప్స్ (పీవీటీజీ)గా చెంచు, కోలం, తోటి, కొండరెడ్డి గిరిజనులను గుర్తించామని చెప్పారు. వీరిలో అర్హులైన ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేయించినట్టు తెలిపారు. ఈ నాలుగు వర్గాల జనాభా 59,583 ఉండగా, వీరిలో 18 ఏండ్లు పైబడినవారు 39,186 మంది ఉన్నారని పేర్కొన్నారు. థర్డ్ జెండర్ ఓటర్లు 1,952 2,556కు పెరిగిందని తెలిపారు.

అక్రమాలపై ఫిర్యాదులకు సీ విజిల్ యాప్

ఎన్నికల్లో జరిగే అక్రమాలు, అవకతవకలు, మద్యం, డబ్బు పంపిణీ తదితర వాటిపై ప్రజలు ఫిర్యాదులు చేయడానికి సీ విజిల్ యాప్ ఏర్పాటు చేశామని రాజీవ్‌కుమార్ తెలిపారు. ఎక్కడ కోడ్ ఉల్లంఘన జరిగినా ఫొటో/వీడియో తీసి యాప్‌లో అప్‌లోడ్ చేసి ఘటన వివరాలు తెలిపితే 100 నిమిషాల్లో (1గంట 40 నిమిషాలు) జీఐఎస్ లోకేషన్ ద్వారా ఎన్నికల కమిషన్ స్పందిస్తుందని చెప్పారు. ఫిర్యాదుదారుల వివరాలను గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. యాప్‌తోపాటు ఓటర్ హెల్ప్‌లైన్, సువిధ పోర్టల్‌లు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. అభ్యర్థుల నేర చరిత్ర వివరాలను 'నో యువర్ క్యాండిడేట్' యాప్‌లో తెలుసుకోవచ్చని అన్నారు. అభ్యర్థుల నేర చరిత్రపై పార్టీలు, అభ్యర్థి కూడా పత్రికల్లో ప్రకటనలు ఇవ్వాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

35 వేల పోలింగ్ కేంద్రాలు..

మొత్తం పోలింగ్ కేంద్రాలు	35,356
సగటున ప్రతి పోలింగ్ కేంద్రానికి	897 మంది ఓటర్లు
పట్టణ ప్రాంతాల్లో	14,458 కేంద్రాలు
గ్రామీణ ప్రాంతాల్లో	20,898 కేంద్రాలు
వెబ్ కాస్టింగ్ చేసే కేంద్రాలు	27,798
యువత నిర్వహించే కేంద్రాలు	119
వికలాంగులు నిర్వహించే కేంద్రాలు	120
మహిళలు నిర్వహించే కేంద్రాలు	597
మాడల్ పోలింగ్ కేంద్రాలు	644

ఎన్నికల సందర్భంగా ఏర్పాటుచేయనున్న అంతర్రాష్ట్ర చెక్ పోస్టులు

శాఖ	చెక్‌పోస్టుల సంఖ్య
పోలీస్	89
రోడ్డు రవాణా	14
కమర్షియల్ టాక్స్	16
ఎక్సైజ్ శాఖ	21
అటవీ శాఖ	8
మొత్తం	148

సంవత్సరాల వారీగా ఓటర్ల సంఖ్య

సంవత్సరం	ఓటర్లు (కోట్లలో)
2014	2.70
2018	2.80
2019	2.96
2020	2.99
2021	3.01
2022	3.03
2023	3.17

ఎంబీసీ చైర్మన్‌గా నందికంటి శ్రీధర్

- టీఎస్ఆర్టీసీ చైర్మన్‌గా జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి
- రైతుబంధు సమితి చైర్మన్‌గా తాటికొండ రాజయ్య
- మిషన్‌భగీరథ వైస్ చైర్మన్‌గా ఉప్పల వెంకటేశ్‌గుప్తా
- నాలుగు కార్పొరేషన్లకు చైర్మన్లు, వైస్‌చైర్మన్ల నియామకం

హైదరాబాద్, అక్టోబర్5 (నమస్తే తెలంగాణ): నాలుగు కార్పొరేషన్లకు చైర్మన్లు, వైస్ చైర్మన్లను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్‌గా నందికంటి శ్రీధర్, టీఎస్ఆర్టీసీ చైర్మన్‌గా ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, రైతుబంధు సమితి చైర్మన్‌గా తాటికొండ రాజయ్య, మిషన్‌భగీరథ వైస్ చైర్మన్‌గా ఉప్పల వెంకటేశ్ గుప్తాను నియమిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. వీరు ఆయా పదవుల్లో రెండేండ్లపాటు కొనసాగనున్నారు. టీఎస్ఆర్టీసీ చైర్మన్‌గా వ్యవహరించిన బాజిరెడ్డి గోవర్ధన్ పదవీకాలం కొద్దిరోజుల క్రితమే ముగియడంతో ఆయన స్థానంలో జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డికి అవకాశం కల్పించింది. ప్రస్తుతం రైతుబంధు సమితి చైర్మన్‌గా కొనసాగుతున్న ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి స్థానంలో స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్యను నియమించింది. అత్యంత వెనకబడిన వర్గాల (ఎంబీసీ) డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన నందికంటి శ్రీధర్ 40 ఏండ్లుగా క్రియాశీల రాజకీయాల్లో కొనసాగుతున్నారు. ఆయన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాకు చెందినవారు.

పార్టీని నమ్ముకున్నవాళ్లకు సముచిత గౌరవం

ఒక్కసారి మాట ఇస్తే దానిని నిలుపుకొని తీరుతామని మరోసారి నిరూపించారు ముఖ్యమంత్రి కేసీఆర్. తాజాగా చేపట్టిన కార్పొరేషన్ల చైర్మన్లు, వైస్ చైర్మన్ల నియామకాల్లో ఇదే విషయం స్పష్టమైంది. గులాబీ జెండాను నమ్ముకుంటే పార్టీ గుండెల్లో పెట్టుకుంటుందనే భరోసా కల్పించారు. ప్రస్తుతం ఎమ్మెల్యేలుగా ఉన్న ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, తాటికొండ రాజయ్యకు క్యాబినెట్ హోదాగల పదవులు ఇచ్చి సముచిత గౌరవం కల్పించారు. స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే టికెట్‌ను ఈసారి కడియం శ్రీహరికి కేటాయించిన నేపథ్యంలో రాజయ్యకు కార్పొరేషన్ పదవితో సముచిత ప్రాధాన్యం కల్పించారు. కల్వకుర్తి నియోజకవర్గానికి చెందిన ఉప్పల శ్రీనివాస్ గుప్తా ఇటీవల పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. మేడ్చల్ మల్కాజిగిరి డీసీసీ అధ్యక్షుడు, ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి నందికంటి శ్రీధర్ బుధవారం పార్టీలో చేరారు. ఆయా సందర్భాల్లో వీరిద్దరికీ వారి రాజకీయ, ప్రజామోద బలానికి తగ్గట్టుగా సముచిత గౌరవం, స్థానం కల్పిస్తామని మంత్రి కేటీఆర్ హామీ ఇచ్చారు. తమకు కీలక బాధ్యతలు అప్పగించినందుకు నందికంటి శ్రీధర్, ఉప్పల శ్రీనివాస్ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. తమ తమ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించి సీఎం కేసీఆర్ రుణం తీర్చుకుంటామని చెప్పారు.

హైదరాబాద్ నగరానికి వరద హెచ్చరిక వ్యవస్థ

- అర్బన్ ఫ్లడ్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ అభివృద్ధి
- ఐఐటీ హైదరాబాద్ పరిశోధన బృందం రూపకల్పన
- వచ్చే ఏడాది పైలెట్ ప్రాజెక్టు ప్రారంభం
- 'వర్షమిత్ర' పేరుతో ప్రచార మస్కట్

సంగారెడ్డి, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ): వరద సమస్య నుంచి హైదరాబాద్ మహానగరాన్ని గట్టెక్కించేందుకు ఐఐటీ హైదరాబాద్ కార్యాచరణ రూపొందిస్తున్నది. ఇందుకుగాను అర్బన్ ఫ్లడ్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్‌ను అభివృద్ధి చేస్తున్నది. ఈ ప్రాజెక్టుకు అవసరమైన సమాచార సేకరణ, క్రోడీకరణను ప్రారంభించింది. ఐఐటీహెచ్ సివిల్ ఇంజినీరింగ్ అండ్ క్లైమేట్ చేంజ్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సతీశ్‌కుమార్ రేగొండ ఆధ్వర్యంలోని పరిశోధన బృందం అర్బన్ ఫ్లడ్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ పనిచేయనున్నది. భారీ వర్షాలు, వరదలు వచ్చినప్పుడు ప్రాణ, ఆస్తినష్టం నుంచి ప్రజలను కాపాడేందుకు అవసరమైన హెచ్చరిక వ్యవస్థను ఈ పరిశోధన బృందం అభివృద్ధి చేస్తున్నది. సతీశ్‌కుమార్‌తోపాటు పరిశోధక బృందం సభ్యులు మహ్మద్ అజారుద్దీన్, పొనుకూటి పద్మిని ఇందుకు అవసరమైన ప్రోగ్రామ్ సిద్ధం చేస్తున్నారు. వర్షమిత్ర పేరుతో ప్రచార మస్కట్‌ను గురువారం విడుదల చేశారు. హైదరాబాద్ వర్షం ఫొటోలు, డ్రైనేజీ వ్యవస్థల సమాచారాన్ని స్నాప్ ఫ్లడ్ అకౌంట్ లేదా స్నాప్ ఫ్లడ్ ట్విట్టర్(ఎక్స్)లో అప్‌లోడ్ చేయాలని కోరుతున్నారు. యాప్ రూపంలో ఉండేలా అభివృద్ధి చేస్తున్నది. వచ్చే ఏడాది చివరన పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించే అవకాశాలు ఉన్నాయి.

విద్యార్థులకు కేసీఆర్ టిఫిన్ నేటి నుంచే

- 1-10 తరగతుల్లో అల్పాహారం
- దేశంలోనే తొలిసారి ఇక్కడే అమలు
- 27,147 బడుల్లో ప్రారంభం
- 23 లక్షల మంది పాఠశాల విద్యార్థులకు ప్రయోజనం
- రావిర్యాలలో ప్రారంభించనున్న మంత్రులు సబిత, హరీశ్‌రావు
- వెస్ట్‌మారేడ్‌పల్లి హైస్కూల్‌లో ప్రారంభించనున్న మంత్రి కేటీఆర్

బ్రేక్‌ఫాస్ట్ లబ్ధిదారులు

యాజమాన్యం	1-5 తరగతులు	6 - 8 తరగతులు	9, 10 తరగతులు
ప్రభుత్వ జిల్లా, మండల పరిషత్తు	11,57,541	6,18,463	3,65,138
ఎయిడెడ్	37,473	23,340	13,823
మాడల్ స్కూళ్లు	-	49,715	36,270
మదర్సాలు	2493	1,491	54
మొత్తం	11,97,507	6,93,009	4,15,285

హైదరాబాద్, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ): చక్కని చదువు కోసం ఉదయాన్నే విద్యార్థుల కడుపు నింపాలన్న గొప్ప సంకల్పంతో ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకొస్తున్న 'సీఎం బ్రేక్‌ఫాస్ట్' శుక్రవారం ప్రారంభం కానున్నది. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలోని రావిర్యాల జడ్పీహెచ్ఎస్‌లో విద్యాశాఖమంత్రి సబితాఇంద్రారెడ్డి, ఆర్థిక మంత్రి హరీశ్‌రావు ఈ పథకాన్ని ప్రారంభించనున్నారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిధిలోని వెస్ట్ మారేడుపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉదయం 8.30కి ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ ప్రారంభిస్తారు. శుక్రవారమే రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో నియోజకవర్గానికి ఒక పాఠశాల చొప్పున ప్రారంభిస్తారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు అల్పాహారాన్ని అందజేస్తారు. ఇందుకు సంబంధించి పాఠశాల విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు చేసింది. ఈ పథకాన్ని రాష్ట్రంలోని 27,147 పాఠశాలల్లో ప్రారంభించనున్నారు. దీనివల్ల 23 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి చేకూరనున్నది. స్కూళ్ల ప్రారంభానికి అరగంట ముందు విద్యార్థులకు అల్పాహారాన్ని వడ్డిస్తారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాలతోపాటు మహబూబ్‌నగర్ జిల్లాల్లోని కొన్ని పాఠశాలల్లో అక్షయపాత్ర సంస్థ ద్వారా, మిగిలిన జిల్లాల్లో మధ్యాహ్న భోజన కార్మికుల ద్వారా అల్పాహారాన్ని అందజేయనున్నారు.

పదో తరగతి వరకు..

ప్రభుత్వ బడుల్లో అల్పాహార పథకాన్ని తొలుత తమిళనాడులో ప్రారంభించారు. ఆ తర్వాత ఈ పథకాన్ని ప్రారంభించిన రెండో రాష్ట్రంగా తెలంగాణ నిలుస్తున్నది. ఈ పథకాన్ని మన రాష్ట్ర ఐఏఎస్ అధికారుల బృందం అధ్యయనం చేసింది. తమిళనాడులో 1-5 తరగతుల విద్యార్థులకే అల్పాహారాన్ని అందిస్తున్నారు. కానీ, మన రాష్ట్రంలో 1 -10 తరగతుల్లోని విద్యార్థులందరికీ బ్రేక్‌ఫాస్ట్ అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. మధ్యాహ్న భోజన పథకాన్ని పలు రాష్ట్రాల్లో 1 -8 తరగతుల వరకే అందిస్తుండగా, రాష్ట్ర ప్రభుత్వం సొంత నిధులతో 9, 10 తరగతుల విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజనాన్ని అందజేస్తున్నది. గత ఏడాది నుంచి బెల్లం కలిపిన రాగిజావను అందజేస్తున్నది. పదో తరగతి విద్యార్థులకు స్పెషల్ క్లాస్ సమయంలో ఉచితంగా స్నాక్స్‌ను ఏర్పాటు చేసింది.

ఆహా.. అద్భుతమైన అల్పాహార మెనూ

బ్రేక్‌ఫాస్ట్ అంటే మొక్కుబడిగా కాకుండా అందరూ ఆశ్చర్యపోయేలా ప్రభుత్వం మెనూను సిద్ధం చేసింది. మిల్లెట్ ఇడ్లీ, ఇడ్లీ సాంబార్, ఉప్మా, పూరి, టమాటా బాత్, కిచిడీ, పొంగల్, పోహా, వెజిటబుల్ పొలావ్ రకరకాల టిఫిన్లను అందించనున్నది. ప్రభుత్వం ఇప్పటికే విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, స్నాక్స్, కోడిగుడ్లను అందిస్తున్న విషయం తెలిసిందే.

దేశంలోనే ఏకైక రాష్ట్రం తెలంగాణ

తెలంగాణ సిద్ధించాక విద్యావ్యవస్థలో సమూల మార్పులు తీసుకొచ్చాం. సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవతో ఎన్నో గొప్ప సంస్కరణలు చేశాం. ఇప్పుడు మరో ముందడుగు వేసి చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నాం. దేశంలోనే తొలిసారిగా 1 నుంచి 10వ తరగతి విద్యార్థులకు 'సీఎం బ్రేక్‌ఫాస్ట్' పథకానికి శ్రీకారం చుట్టాం. ఈ పథకం అమలు తీరుపై నిత్య పర్యవేక్షణ ఉంటుంది. పట్టణాల్లో మున్సిపల్ కమిషనర్లకు, గ్రామీణ ప్రాంతాల్లో జిల్లా అదనపు కలెక్టర్లకు పర్యవేక్షణ బాధ్యతలను అప్పగించాం. విద్యాశాఖ, పంచాయతీ రాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖలు సమన్వయంతో పథకాన్ని పర్యవేక్షిస్తాయి. సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకంతో డ్రాపౌట్లు తగ్గుతాయని, హాజరు శాతం పెరుగుతుందని ఆశిస్తున్నాం. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.672 కోట్లు ఖర్చు చేస్తున్నది. సన్న బియ్యంతో భోజనం, వారానికి మూడు గుడ్లు అందిస్తున్నాం. సన్న బియ్యం కోసం రూ.187 కోట్లు, గుడ్ల కోసం రూ.120 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం అదనంగా భరిస్తున్నది. రూ.32 కోట్లు వెచ్చించి ఐరన్, సూక్ష్మ పోషకాలతో కూడిన రాగి జావను అందిస్తున్నాం. విద్యాశాఖపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్న సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు. సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకం ప్రవేశపెట్టినందుకు ధన్యవాదాలు.

- సబితాఇంద్రారెడ్డి, విద్యాశాఖ మంత్రి

ప్రైమరీ స్కూళ్ల వేళలు

- ఉదయం 9:30 నుంచి సాయంత్రం 4:15 గంటల వరకు
- అల్పాహార సమయం - ఉదయం 8:45 గంటల నుంచి
- ప్రార్థన సమయం - ఉదయం 9:35 నుంచి 9:45 వరకు

(హైదరాబాద్, సికింద్రాబాద్ పరిధిలో)

- ఉదయం 8:45 నుంచి సాయంత్రం 3:45 వరకు
- అల్పాహార సమయం - ఉదయం 8 గంటల నుంచి
- ప్రార్థన సమయం - ఉదయం 8:50 నుంచి 9 గంటల వరకు

అప్పర్ ప్రైమరీ, హైస్కూళ్ల వేళలు

- ఉదయం 9:30 నుంచి సాయంత్రం 4:45 గంటల వరకు
- అల్పాహార సమయం - ఉదయం 8:45 గంటల నుంచి
- ప్రార్థన సమయం - ఉదయం 9:35 నుంచి 9:45 వరకు

(హైదరాబాద్, సికింద్రాబాద్ పరిధిలో..)

- ఉదయం 8:45 నుంచి సాయంత్రం 4:00 వరకు
- అల్పాహార సమయం - ఉదయం 8 గంటల నుంచి
- ప్రార్థన సమయం - ఉదయం 8:50 నుంచి 9 గంటల వరకు



సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞత చాటుతూ రాసిన ఉత్తరాలను పోస్టుబాక్సులో వేస్తున్న తొర్రూరు విద్యార్థులు

అల్పాహార దాతకు ఉత్తరాలతో కృతజ్ఞతలు

రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ బడుల్లో చదువుతున్న విద్యార్థులకు ఉదయం అల్పాహారం అందజేయాలన్న సదాశయంతో తెలంగాణ ప్రభుత్వం శుక్రవారం 'సీఎం అల్పాహారం' పథకాన్ని ప్రారంభించనున్న విషయం తెలిసిందే. అయితే.. పథకం ప్రారంభానికి ఒకరోజు ముందే వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో.. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 170 పాఠశాలలకు చెందిన లక్ష మంది విద్యార్థులు పోస్టుకార్డుల ద్వారా సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులు రాసిన ఉత్తరాల్లో ఏముందంటే.. 'సీఎం కేసీఆర్ తాతకు నమస్కారాలు. మా బడులు మారుతున్నాయి. ఇప్పుడు మా ఆకలి తీర్చడానికి అమ్మలా ఆలోచించి మీరు ప్రేమతో సీఎం అల్పాహార పథకం పెట్టినందుకు శతకోటి వందనాలు. ఖాళీ కడుపుతో రోజు బడికి వెళ్తే క్లాసులో కండ్లు తిరుగుతుండేవి. పొద్దునే ఇంటి పనితోపాటు మాకు వంట చేసేందుకు అమ్మకు కష్టంగా ఉండేది. అమ్మను బాధపెట్టలేక ఖాళీ కడుపుతోనే బడికి వచ్చేవాళ్లము. ప్రార్థనలో చాలా సార్లు పడిపోయాము. ఇలాంటి పరిస్థితులలో అల్పాహార పథకాన్ని ప్రారంభిస్తున్నందుకు చేతులెత్తి మొక్కుతున్నాము. మన ఊరు-మన బడి పథకంతో మా బడులు మెరిసిపోతున్నాయి. పేద పిల్లల చదువు కోసం ఆరాటపడుతున్న మీకు మా అమ్మానాన్న తరపున ధన్యవాదాలు' అంటూ పేర్కొన్నారు.

- తొర్రూరు